

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
శనివారం 14-6-2025 పేజీలు : 8

### స్వామి వేషంలో మోసాలకు పాల్పడుతున్న
# ముఠా అరెస్ట్..

- రూ.15.30 లక్షల నగదు, బంగారం,3 కార్లు,7 సెల్ ఫోన్‌లు స్వాధీనం

**కరీంనగర్ క్రైం,జూన్ 13,ప్రజాజ్యోతి:** అమాయక ప్రజలను స్వామి వేషంలో పూజలు చేస్తామంటూ నమ్మించి, లేనిపోని పూజల పేరుతో డబ్బు దోచుకుని, బెదిరింపులకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి రూ. 15 లక్షల 30 వేల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు (ఒక క్రెటా, ఒక బాలెనో, ఒక తార్), మరియు 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కరీంనగర్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపిన వివరాల ప్రకారం గత పదిహేను రోజుల క్రితం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ (25) తండ్రి కనకయ్య, ఆర్టీసీ వేములవాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఒక ప్రమాదంలో ఎడమ కాలు విరిగింది.

మిగతా 4లో...




# నిరాశలో కాంగ్రెస్ శ్రేణులు

**కరీంనగర్ :** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో తమ దశ మారుతుందని ఆశపడ్డ కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు ఇప్పుడు పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో పడిపోయాయి. ఎన్నికలకు ముందుగాని మళ్లీ మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండే అవకాశం లేనందువల్ల ఈ నియోజకవర్గం పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండదనే భావనతో డీలా పడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొన్నటి వరకు ఉన్న ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా నియోజకవర్గంలో ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కక, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పడక, ఇళ్లు మంజూరు కాక మరే ఇతర అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారానికి నోచుకోక పార్టీ పరిస్థితి ఇటు నియోజకవర్గ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందనే అభిప్రాయం ఉన్నది. మంత్రివర్గ విస్తరణలో మానకొండూర్ శాసనసభ్యుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు మంత్రి పదవి దక్కితే ఈ జిల్లాకు నేరుగా మంత్రి పదవి వచ్చి అతని నేతృత్వంలో ప్రస్తుత పరిస్థితులకు పుల్‌స్టాప్ పడుతుందని ఆశించారు. ఆఖరు నిమిషం వరకు ఆయనే ప్రతిపాదనలో ఉన్నా చివరి క్షణంలో అదికాస్తా మారి జగిత్యాల జిల్లాకు చోటు దక్కింది. దీంతో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పరిస్థితి మరింత ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు డీసీసీ అధ్యక్షునిగా ఉన్న సత్యనారాయణ కొంత చురుకుగా వ్యవహరిస్తూ కార్యకర్తల సమస్యలను పట్టించుకునేవారని, ఇప్పుడు ఆయన కూడా అసంతృప్తికి లోనై ఉండడంతో తమకు ఎంతవరకు అండగా ఉంటారన్నది తెలియక పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.

### మంత్రుల ఆధిపత్యపోరే కారణమా?

ఆయనకు మంత్రి పదవి దక్కకపోవడానికి కూడా ఇద్దరు మంత్రుల ఆధిపత్యపోరే కారణమనే అభిప్రాయం పార్టీ ద్వితీయ శ్రేణి నేతల్లో, కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నది. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసిమెలిసి ఉంటూ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాలుపంచుకునే కవ్వంపల్లి సత్యనారాయణ కొద్ది నెలలుగా వారిద్దరి మధ్య నెలకొన్న అభిప్రాయ బేధాలతో ప్రభాకర్‌కు దూరమయ్యారు. శత్రువు శత్రువు మనకు మిత్రుడు అన్నట్లు కవ్వంపల్లి కాస్త శ్రీధర్‌బాబు శిబిర వర్గీయుడిగా ముద్రపడ్డారు. ఆయన శ్రీధర్‌బాబుతో ఎంతవరకు కలిసి పనిచేశారో లేదోకానీ ఇప్పుడు శ్రీధర్‌బాబు అండదండలు కూడా ఆయనకు లభించలేదనే అంటున్నారు. శ్రీధర్‌బాబు తమ జిల్లా రాజకీయ నేపథ్యం రీత్యా ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కే మంత్రి పదవి దక్కాలని భావించారని, అందుకు తన సపోర్టు కూడా సంపూర్ణంగా అందించడంతోనే లక్ష్మణ్ కుమార్ మంత్రి అయ్యారని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.



### ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ సంక్షేమ అభివృద్ధి
# కార్యక్రమాలు అమలు

2 లో..

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- శాంతి భద్రతల నిర్వహణ చాలా కీలక అంశం
- భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- ఎలిగేడు మండలానికి నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి
- ఎలిగేడు మండలంలో నూతన పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి



## "పాటల పల్లకిలో..."పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే

**చొప్పదండి, జూన్ 13(ప్రజా జ్యోతి):** జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఆదివారం జరగనున్న పాటల పల్లకిలో.. పోస్టర్ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమ కవి గాయకుడు కిషోర్, టిపిసిసి సాంస్కృతిక సేన రాష్ట్ర నాయకుడు రఘు, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "పాటల పల్లకిలో 12 గంటలు" కార్యక్రమానికిహాజరుకావాలని కళాకారులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కళాకారులు జలపతి, గసికంటి కుమార్, సదానందం, సంజీవ్ కుమార్, మధు, డోలక్ రాజు, నగేష్, జంపన్న తదితరులు పాల్గొన్నారు.



## రాచపల్లి లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ఇల్లందకుంట మండలం రాచపల్లి ప్రాథమిక పాఠశాల లో మండల విద్యాధికారి రాములు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలలో చదివే 1తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఉచిత యూనిఫామ్స్ అందించారు. విద్యార్థుల కు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యా వాహిని ప్రచార వాహనం తో రాచపల్లి లో బడిబాట ప్రచారం చేశారు. ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఇంటింటా వాడవాడలా బడిబాట ప్రచారం చేశారు.. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె రామిరెడ్డి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, రమాదేవి, వేణుగోపాల చారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి




**కొనరావుపేట:జూన్.13(ప్రజాజ్యోతి):** ఎంతోకాలంగా పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు%శీ%ది మండలంలోని పల్లిమక్త గ్రామంలో అర్జీలను స్వీకరించినట్లు డిప్యూటీ తహసిల్దర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు అర్జీలు పెట్టుకున్న రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ

**కోనరావుపేట: జూన్.13(ప్రజా జ్యోతి):** వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త చిట్ల సతీష్ తండ్రి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చలిమేడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి తన ప్రగడ సంతాపాన్ని తెలియచేశారు తన వెంట సెస్ డైరెక్టర్ హరి చరణ్ రావు మాజీ జడ్పిటిసి మ్యకల రవి సీనియర్ నాయకులు వెంకటరమణారావు వేణుగోపాల్ రవితేజ శ్రీనివాస్ కిషన్ ఉన్నారు.





# మహిళల ఆరోగ్యమే.. ఇంటి ఆరోగ్యం

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..



**జమ్మికుంట,జూన్13( ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సి.డి.ఏం.ఎ ఆదేశాల మేరకు 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మహిళలకు, పారిశుద్య కార్మికులకు ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డి.ఎం అండ్ హెచ్ వో చందు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, మెప్మా జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీవాణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ హెల్త్ క్యాంపులో ప్రతి మహిళ, పారిశుద్య కార్మికులు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ వైద్య పరీక్షలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్యాంపు ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద పెద్ద పట్టణంలోని ఆసుపత్రిలో వేలాది రూపాయలు వెచ్చించి ఓపికగా ఉంటారు. అదేవిధంగా ఈ ప్రత్యేక హెల్త్ క్యాంపులో ప్రతి ఒక్కరు ఓపికగా ఉండి వైద్య పరీక్షలు నిర్వహించి ముందుకు తీసుకొని వెళ్ళాలన్నారు. మన ఆరోగ్యం మన ఓపిక అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటి డి.ఎం. అండ్ హెచ్ వో చందు మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళలను దృష్టిలో పెట్టుకొని మహిళా వైద్యులతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించి వ్యాధిని అరికట్టాలన్నారు. ఈ వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరు పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మహిళలో అధిక మరణాలు రొమ్ము క్యాన్సర్, ఎముకల క్యాన్సర్ లతో సంభవిస్తున్నాయన్నారు. వాటిని ముందుగా పరీక్షలు నిర్వహించి, చిన్న గాయం ఉన్న పరీక్షలు నిర్వహించుకుని, వచ్చే వ్యాధులను అరికట్టాలన్నారు. వైద్యులకు ఎటువంటి మొహమాటం లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మహిళల ఆరోగ్యం ఇంటికి రక్షణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన, వైద్యులు హిమబిందు, మహెూన్నత పటేల్, కంటి వైద్యులు జలధర్, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, హెల్త్ సూపర్ వైజర్ రచన, అరుణల, మెప్మా సి.ఎల్ అర్పిలు మంజుల, జ్యోతి, ఏ. ఎన్ఏం లు రజిత, మంజుల, రాధ, సాజిద, కవిత మెప్మా అర్పిలు, సంఘ సభ్యులు, పారిశుద్య కార్మికులు పలువురు పాల్గొన్నారు..

# ప్రభుత్వానికి గులాం గిరి చేస్తున్న సింగరేణి

**-సిబిఎస్ఇ స్కూల్ ప్రారంభోత్సవం ఆహ్వానంలో అధికారపార్టీ ఆధిపత్యం**

**-సిఅండ్ఎండీ,యూనియన్ నాయకులకు అవమానం**

**-ఏఐటియూసి అధ్యక్షులు సీతారామయ్య**




**గోదావరిఖని , జూన్ 13 (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థ సిబిఎస్ఇ స్కూల్ ప్రారంభోత్సవ ఆహ్వానంలో అధికారపార్టీ ఆధిపత్యం,సింగరేణి సి అండ్ ఎండీ,యూనియన్ నాయకులకు అవమానం జరిగిందని సింగరేణి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) అద్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు.శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణి కార్మికుల పిల్లలకు చదువుల విషయంలో తలెత్తున్న ఇబ్బందులను తమ యూనియన్ గుర్తించి సింగరేణిలో సిబిఎస్ఇ స్కూళ్లు ఏర్పాటు చేయాలని సి అండ్ ఎండీ బలరాంతో చర్చించామని,ఈ మేరకు మొదటగా గోదావరిఖనిలో తర్వాత బెల్లంపల్లి రీజియన్ శ్రీరాంపూర్ లో ఒక సిబిఎస్ఇ స్కూల్ ఏర్పాటుకు అంకరీకరించినట్లు చెప్పారు.8వ కాలనీలో సిబిఎస్ఇ స్కూల్ ప్రారంభోత్సవం చేసుకుంటుందని కానీ సొమ్ము సింగరేణిది,పెత్తనం ప్రభుత్వానిది అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.సింగరేణి కార్మికుల పిల్లల కోసం సింగరేణి సొమ్ముతో సిబిఎస్ఇ స్కూల్ ఏర్పాటు చేస్తే ప్రారంభోత్సవ ఆహ్వానంలో మాత్రం మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ ల పేర్లను తాటికాయంత పెద్దగా వేసి సింగరేణి సి అండ్ ఎండీ,యూనియన్ నాయకుల పేర్లను చిన్నగా కింద వేయడాన్ని సీతారామయ్య తీవ్రంగా ఖండించారు.సింగరేణిలో అధికార పార్టీ ఆగడాలు మితిమీరి పోయాయని,పెద్ద అధికారులు తమ పదవిని కాపాడుకోవడానికి అధికార పార్టీకి తాబేదారులుగా మారారని విమర్శించారు.జి.ఎం స్థాయి అధికారులు సిగ్గు లేకుండా ఫైల్స్ సంకలో పెట్టుకొని ఎమ్మెల్యే ల వద్దకు పరుగులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకుముందు సింగరేణి అధికారులతో పనిపడితే ఎమ్మెల్యేలే జిఎంల వద్దకు వచ్చి మాట్లాడేవారని గుర్తు చేశారు.సింగరేణిలో ప్రతి పనికి అధికార పార్టీ మంత్రులు,ఎమ్మెల్యేలు తల దూర్చుతూ అన్నింటి లోనూ తామే అంటున్నారని,అలాంటప్పుడు యూనియన్లు ఎందుకని,గుర్తింపు సంఘం ఎందుకని ఆయన ప్రశ్నించారు.సింగరేణి అధికారులు తమ పదవులను కాపాడుకోవడానికి,అధికార పార్టీకి సింగరేణిని తాకట్టు పెట్టడం మానుకోవాలనీ,ఇలాగే కొనసాగితే కార్మికుల నుండి తిరుగుబాటు తప్పదని సీతారామయ్య హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం,శ్రీరాంపూర్ కార్యదర్శి బాజీసైదా,ఆర్జీ టూ కార్యదర్శి జిగురు రవిందర్,నాయకులు రంగు శ్రీను,కారంపూడి వెంకన్న,బలుసు రవి,దాసరి శ్రీనివాస్,ఆకునూరి శంకరయ్య,చెప్యాల మహేందర్ రావు,పడాల కనకరాజు,ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ తో పాటు ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

# స్వామి వేషంలో మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

-రూ.15.30 లక్షల నగదు,బంగారం,3 కార్లు,7 సెల్ ఫోన్‌లు స్వాధీనం



**కరీంనగర్ క్రైం,జూన్ 13,ప్రజాజ్యోతి:** అమాయక ప్రజలను స్వామి వేషంలో పూజలు చేస్తామంటూ నమ్మించి, లేనిపోని పూజల పేరుతో డబ్బు దోచుకుని, బెదిరింపులకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి రూ. 15 లక్షల 30 వేల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు (ఒక క్రెటా, ఒక బాలెనో, ఒక తార్), మరియు 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కరీంనగర్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపిన వివరాల ప్రకారం గత పదిహేను రోజుల క్రితం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ (25) తండ్రి కనకయ్య, ఆర్టీసీ వేములవాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఒక ప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. అతని తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని, పది రోజుల క్రితం స్వామి వేషంలో ఉన్న ఒక వ్యక్తి గజ్జి ప్రవీణ్‌కు పరిచయమయ్యాడు.అతను ప్రవీణ్ ఇంట్లో ఏమీ బాగోలేదని, ఇంటి పక్కనే క్వింటాల్ వరకు బంగారు కడ్డీ ఉందని, దానిని బయటకు తీసి పూజలు చేస్తే కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, లేకపోతే అతని తండ్రి నెల రోజులలోపు చనిపోతాడని నమ్మబలికాడు. అందుకు పూజలు చేయాలని, కావాల్సిన పూజా సామాగ్రి కొనుగోలు చేయాలని మాయమాటలు చెప్పి, విడతలవారీగా రూ. 3 లక్షలు, రూ. 5 లక్షలు, రూ. 10 లక్షలు - మొత్తం రూ. 15 లక్షల 30 వేల నగదు గజ్జి ప్రవీణ్ వద్ద పూజల పేరుతో, పూజా సామాగ్రి పేరుతో వసూలు చేశాడు.డబ్బులు తీసుకున్న తర్వాత, నిందితులు కొంత పూజా సామాగ్రి కొనుగోలు చేసి, ఇంటి పక్కనే ఒక గొయ్యి తవ్వి, కుంకుమ, పసుపు చల్లి, అందులో నుంచి ఒక డబ్బా(బంగారం అని నమ్మబలికి) ఇచ్చి, అందులో కిలో బంగారం ఉంటుందని చెప్పి ప్రవీణ్ ఇంటిలోని దేవుడి గదిలో పెట్టించారు. ఇంకా డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడుతూ, “లేకపోతే మీ నాన్నను ఇక్కడే చంపి పాతిపెడతాం” అని హెచ్చరించారు. వారి బెదిరింపులకు భయపడిన ప్రవీణ్,చుట్టుపక్కల వారి వద్ద నుండి మరికొంత డబ్బు తీసుకొని వారికి ఇవ్వడం జరిగింది.ఫిర్యాదుదారుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ మోసానికి పాల్పడినవారు.ఈర్నాల రాజు (చంద్రగిరి గ్రామం) మిరియాల దుర్గయ్య (అగ్రహారం గ్రామం)పెనుగొండ రాజు (చీర్లవంచ గ్రామం)చల్లా అజయ్ (చీర్లవంచ గ్రామం)ఈర్నాల సతీష్ (చీర్లవంచ గ్రామం)ఉన్నారు,ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ శ్రీ శుభం ప్రకాష్ పర్యవేక్షణలో కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్సై ఏ. లక్ష్మారెడ్డి వారి సిబ్బందిని అభినందించారు,

# ఇద్దరు కన్నపు దొంగల అరెస్ట్




**కరీంనగర్ క్రైం,జూన్ 13,ప్రజాజ్యోతి:**ఇద్దరు కన్నపు దొంగలను శుక్రవారం కరీంనగర్ పోలీసులు అరెస్ట్ అరెస్టు చేశారు, ఈ సందర్భంగా శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వివరాలను వెల్లడించారు,రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట్ కు చెందిన గాజుల హేమంత్ (19) అనే యువకుడిని అతని స్నేహితుడైన కొమ్ము నవీన్ కరీంనగర్ కమిషనర్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డారు,వారి వద్ద నుండి దొంగిలించబడిన 20 తులాల బంగారు ఆభరణాలు,25 తులాల వెండి వస్తువులు,ఒక ప్యాషన్ ప్లస్ మోటార్‌సైకిల్ ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు,ఇంకా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.దొంగతనానికి పాల్పడినన నేరస్థులను గుర్తించి పట్టుకుని వారినుండి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేయటంలో కృషి చేసిన రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ,చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ రాజు,గంగాధర ఎస్సై వంశీకృష్ణ, సీసీఎస్ ఎస్సై నాగరాజు వారి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సురేంద్రపాల్ ,కానిస్టేబుళ్లు రవీందర్, అవినాష్ ,సాయి సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ ప్రదీప్ లను పోలీసు కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా లో అంతరాయం

**జమ్మికుంట, జూన్13,( ప్రజాజ్యోతి ):** మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ మరమ్మతుల కారణంగా జూన్14న శనివారం నీటి సరఫరా లో అంతరాయం ఉంటుందని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ తెలిపారు. హుజురాబాద్, జమ్మికుంట,ఇల్లంధకుంట,వీణవంక, కమలాపూర్ మండలాలకు శనివారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు..

# అడ్రియాల అధికారులకు టిబిజికెఎస్ ఘన సన్మానం

- పదోన్నతికి సంబంధించి గనిలో అభినందనలు

**రామగిరి, జూన్ 13 (ప్రజాజ్యోతి):** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) ఆధ్వర్యంలో అడ్రియాల గనిలో అధికారులు జనార్ధన్ మరియు సునీల్‌కు ఘనంగా సన్మానం చేశారు. జనార్దన్ గారు ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, సునీల్ గారు మేనేజర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఈ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ సందర్భంగా అధికారులు శాలువాలతో సత్కరించబడి, బొకేలు అందుకోగా, వారి సేవలను గుర్తించి పలువురు సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం టీబీజీకేఎస్ ఏఎల్పీ గని ఫిట్ సెక్రటరీ వివి గౌడ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ క్రాంతి యాదవ్ సమన్వయంతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా సంఘ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య, ఉప ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, తదితర నేతలు దేవ శ్రీనివాస్, కేశవరావు, ఎండి. షరీఫ్, సుద్దాల తిరుపతి, దాసరి మల్లేష్, మాదాసు చంద్రయ్య, తేజ, గట్టు శ్రీనివాస్, చిరంజీవి, సురేష్, సైండ్ల సత్యనారాయణ, గండి శ్రీనివాస్, వెంకటేష్, శ్రీను, రాజేష్, సందీప్, రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, వినయ్, సది, టి వెంకటేష్, సుమంత్, పెరక రమేష్, సతీష్, కుమార్, చిన్నయ్య, ప్రేమ్ కుమార్, లాల్, లోకేష్, తోట రవి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పదోన్నతి పొందిన అధికారులకు అభినందనలు తెలిపిన సంఘ నాయకులు, వారి నాయకత్వంలో గనిలో అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనగర్తి లో చోరీ

## రూ.10 వేల నగదు అపహరణ



**కోనరావుపేట:జూన్.13(ప్రజా జ్యోతి):** మండలంలోని కనగర్తి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.గ్రామానికి చెందిన వంగపల్లి శంకర్ ఇటీవల తన భార్య మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి తన సోదరుని ఇంట్లో ఉంటున్నారు.ఈ క్రమంలో రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.10 వేలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ప్రశాంత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పోలీస్ జాగిలాలతో పరిసర ప్రాంతాలను తనిఖీ చేయించారు. క్లూస్ టీం ఫింగర్ ప్రింట్, వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# తండ్రి మందలించాడని బాలుడి ఆత్మహత్య



**రామగిరి, జూన్ 13 (ప్రజాజ్యోతి) :** తండ్రి మందలించాడని మనస్థాపం చెందిన బాలుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పరిధిలోని లక్ష్మీ నగర్ నివాసముండే లెక్కల వెంకటేష్ రమాదేవి దంపతుల కుమారుడు శివశంకర్ (15), గడచిన విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసి వేసవి సెలవుల్లో ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి ఇప్పిచ్చిన నూతన ఫోన్లో తరచూ స్నాప్చాట్, ఇన్‌స్టాగ్రామ్ వాడితో తండ్రిదండ్రుల మాటను పెడ చెవిన పెడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 4న ఎప్పుడు ఫోన్ చూస్తూనే ఉంటావా తండ్రి మందలించగా మనస్తాపం చెందిన శివశంకర్ పురుల మందులు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాగిన కొంత సమయం తర్వాత పురుగుల మందు సేవించినట్లు తల్లి రమాదేవికి చెప్పగా, 108 వాహనంలో పెద్దపల్లి ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి, అటు నుంచి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ రోజు నుండి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న శివశంకర్ శుక్రవారం ఇంటికి వస్తున్న తరుణంలో మార్గమధ్యంలో మరణించాడు. తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మృతదేహాన్ని తరలించారు.

## యూనిఫామ్ పాఠ్యపుస్తకాలు అందజేత



కొనరావుపేట: జూన్.13(ప్రజా జ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతన విద్యాభ్యాసం సందర్భంగా పిల్లలకు యూనిఫాం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు అలాగే చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 4 కోట్ల 20 లక్షల రూపాయలతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

### మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజాజ్యోతి), జూన్ 13:శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో పర్యటించిన రాష్ట్ర హౌసింగ్ రెవెన్యూ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు 4 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మించే సమీకృత మార్కెట్ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎలిగేడు మండలంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ ను మంత్రులు ప్రారంభించారు. పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్ లను మంత్రులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సుధా చైర్మన్ కే నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ , ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు కనీస విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### విద్యా సంవత్సరం యాక్షన్ ప్లాన్ పై సమీక్షించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి) , జూన్-13: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యా సంవత్సరం యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో తొలిమెట్టు, ఉన్నతి వంటి వివిధ కార్యక్రమాల అమలు, పిల్లల అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పాఠశాలల తనిఖీ షెడ్యూల్, తదితర వివిధ అంశాలను జిల్లా విద్యాశాఖ వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రాథమికంగా పిల్లలకు తెలుగు, ఆంగ్లం చదవడం రాయడం, కనీస గణిత సామర్థ్యాలు ఉండేలా శిక్షణ అందించాలని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి యొక్క అభ్యాసన సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల బస్ పాస్ చార్జీలను తగ్గించాలని ఆర్ టి సి అధికారులకు వినతి పత్రం

### - ఏబీవీపీ హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిరసన

జమ్మికుంట, జూన్13( ప్రజాజ్యోతి ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు హామీ కారణంగా వస్తున్న నష్టాన్ని భర్తీ చేయటానికే విద్యార్థుల బస్సు పాస్ చార్జీలు పెంచి విద్యార్థుల మీద భారం మోపుతోందని ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ఆర్ టి సి రవాణాలో ప్రయాణిస్తూ చదువుకునే విద్యార్థుల బస్ పాస్ చార్జీలు పెంచడాన్ని ఎబివిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్ చార్జీలు ఆకాశాన్ని అంటుతున్నాయి మళ్ళీ చార్జీలను పెంచాలని చూడటం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమే అన్నారు. ఫ్రీ బస్ కారణంగా సరిపడ బస్ లు లేక విద్యార్థులు తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ఫుట్ బోర్డ్ ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులకు సరిపడ బస్సులు నడపడం చేత కానీ అధికారులు బస్ పాస్ చార్జీలు మాత్రం పెంచడానికి సిద్ధం అవుతున్నారని మండిపడ్డారు. ఎబివిపి గతంలో అనేకసార్లు విద్యార్థులు ఎక్కువ ప్రయాణించే దారుల్లో బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసిన ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి లేక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిందని గుర్తు చేశారు. అధికారులు బస్ పాస్ ఛార్జీలు పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని విద్యార్థులకు పాత బస్ పాస్ చార్జీలే నిర్ణయించాలని ఎబివిపి డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి రాజ్ కుమార్, ఆర్యన్, నగర ఉపాధ్యక్షులు వినయ్, రాకేష్, తేజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రామిక వర్గ ఐక్యతతోనే కులనిర్మూలన

### - దేశ సమైక్యతను దెబ్బతీస్తున్న మోడీ విధానాలు-రాజ్యాంగ రక్షణకు అట్టడుగు వర్గాలు ఐక్యం కావాలి

### - కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి ), జూన్ 13: మార్బ్ పూలే అంబేద్కర్ స్ఫూర్తితో శ్రామిక వర్గఐక్యతను సాధించాలని తద్వారా కుల నిర్మూలన జరుగుతుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అన్నారు . శుక్రవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో శాంతినగర్ లో కెవిపిఎస్ పెద్దపల్లి, ఆసిఫాబాద్ ,మంచిర్యాల, జిల్లాల నాయకులకు రెండు రోజుల సామాజిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు . అనంతరం కులసమస్య వర్గదృక్పదం అనే అంశం పై క్లాసు బోధించారు .కేవీపీ ఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు మొదటి రోజు శిక్షణ తరగతులకు ప్రారంభసూచకంగా కెవిపిఎస్ జెండాను పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు మొదుంపెల్లి శ్రవణ్ ఆవిష్కరించారు. అనంతరం తరగతుల నుద్దేశించి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడారు. మోడీ పాలనలో దేశంలో సామాజిక న్యాయంపై ప్రభుత్వ రంగ సంస్థలపై తీవ్రమైన దాడులు కొన సాగిస్తోందన్నారు. దళిత జనాభా ప్రకారం సబ్ ప్లాన్ నిధులను కేంద్ర బడ్జెట్ లో కేటాయించకుండా మోసం చేస్తుందన్నారు. ఎస్సీ ,ఎస్టీ రిజర్వేషన్లు పై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ధ్వాడిచేస్తుందని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పజెప్పుతుందన్నారు. ప్రైవేట్ రంగ సంస్థలలో రిజర్వేషన్ లు అమలు చేయకపోవడంతో రాజ్యాంగ హక్కులను దళితులు , బలహీన వర్గాలు పొందాలేక పోతున్నారని అన్నారు. బిజెపి పాలనలో ప్రతి రోజు ఆరుగురు దళిత మహిళలు అత్యాచారానికి గురువుతున్నారని అన్నారు వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దళితులపై అత్యధికంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. మోడీ మనువాద విధానాలపై రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం సమరశీల పోరాటాలు కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయల అంబేద్కర్ అభయ హస్తం ప్రకటించి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా ప్రతి అర్హులైన లబ్దిదారుడికి రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ షరతులను పెట్టి రాజీవ్ వికాస్ పథకానికి అనర్హులుగా ప్రకటిస్తే లబ్దిదారులతో కెవిపిఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని తెలిపారు. కెవిపిఎస్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీలకు 25 శాతం ఉచిత ప్రవేశాన్ని కల్పించే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి అశోక్ , మొదుంపల్లి శ్రావణ్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్కే మోహన్ లక్ష్మి, నవీన్, ప్రకాష్, సూరజ్ ,రాజు,అభి,మోహన్, సంజయ్, రిన,తదితరులు పాల్గొన్నారు.



## మహిళా కమిషన్ చైర్మెన్ శారదా కి సన్మానం

### -ఇల్లందకుంట దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు

ఇల్లందకుంట, జూన్13( ప్రజాజ్యోతి ): తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ని ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానం చేశారు. వారికి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం యొక్క చిత్రపటం లడ్డు, స్వామివారి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మహిళా కమిషన్ చైర్మన్ ని ఇల్లందకుంట దేవస్థానం%శి% దర్శనం కోసం రావాల్సిందిగా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోడిశాల పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, మహమ్మద్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్**



**కోరుట్ల,జూన్ 13 ప్రజాజ్యోతి ప్రతినిధి**

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అన్నారు.. శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ అవరణ లో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పురపాలక శాఖలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు,ఎస్ హెచ్ జీ,మహిళలకు అధికారులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుమారు 150 మందిని రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో చాలామంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు.. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె, కాలేయం తదితర సంబంధించిన వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని చెప్పారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నిర్వహించి వైద్య శిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేడూ అలవాట్లను మానివేయాలని, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.పట్టణ పారిశుద్ధ్యంలో పారిశుద్ధ కార్మికులు చేసే సేవలు మరువలేనివని, వీరు పారిశుధ్య విధులు నిర్వహిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరూ వారి సేవలను గుర్తించి వారిని గౌరవించాలని సూచించారు..మున్సిపల్ శాఖ కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బందికి కమీషనర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సమీని, డాక్టర్ శృతిలయ, డాక్టర్ అనిల్, సూపర్వైజర్లు ధనుంజయ, భూషణ్, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ మల్లికార్జున్, ల్యాబ్ టెక్నీషియన్లు సాజిద్ అలీ,రాము,రియాజ్, ఎస్ టి ఎస్ ఇమ్రాన్, హరీష్, సంతోష్, రమ్య, శంకర్, నాగరాజు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది అశోక్, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యం

**- కొడిమ్యాలలో అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమం - పాల్గొన్న అదనపు కలెక్టర్ బిఎస్ లత**

**కొడిమ్యాల,జూన్ 13,(ప్రజాజ్యోతి):**

అంగన్ వాడి కేంద్రాల్లో చేర్పించడం ద్వారానే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత స్పష్టం చేశారు.శుక్రవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ మాట–అంగన్వాడి బాట కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సిడిపిఓ వీరలక్ష్మి,సూపర్వైజర్ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు కాకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తారని తద్వారా పిల్లల్లో సమగ్రాభివృద్ధి జరుగుతుందని,ప్రతి తల్లిదండ్రులు పిల్లల్ని తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపాలన్నారు.జిల్లా సంక్షేమాధికారి నరేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో



బోధించే బోధన వల్ల పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.తదనంతరం భోజన మెనూలో భాగంగా ఎగ్ బిర్యానీ పౌష్టికాహార పంపిణీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప,ఎంఈఓ శ్రీనివాస్,ఉమా, శారద,జానకి,జ్యోతి,మహేశ్వరీ మరియు అంగన్వాడీ టీచర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



## భర్తతో గొడవ..కొడుకుని తీసుకొని

# ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్య

**కొడిమ్యాల,జూన్13,(ప్రజాజ్యోతి):**

భర్తతో చిన్న గొడవపడి భార్య తన కొడుకును తీసుకొని అదృశ్యమైన సంఘటన కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్సై సందీప్ వివరాల ప్రకారం కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన బాణాల రాకేష్ భార్య మౌనిక భర్తతో చిన్న గొడవ పడింది.

ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన ఉదయం 8గంటల సమయంలో మౌనిక తల్లి గ్రామమైన స్టేషన్ ఘన్పూర్ కు వెళ్తానని చెప్పి చిన్న కొడుకు రాంచరణ్ ను తీసుకొని ఇంటి నుండి వెళ్లడం జరిగిందని తెలిపారు.భార్య మౌనిక కు రాకేష్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చిందని,రాకేష్.. మౌనిక తల్లిదండ్రులను సంప్రదించగా తమ వద్దకు రాలేదని తెలుపగా బంధువులతో కలిసి చుట్టుపక్కల వెతికిన ఆమె,ఆమె కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో భర్త రాకేష్ కొడిమ్యాల పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసాడు.మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన మంత్రి వివేక్ జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల జూన్ 13 ప్రజాజ్యోతి ప్రతినిధి**

రాష్ట్ర మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చెన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు లు శుక్రవారం హైదరాబాదులోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని పిసిసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు

## విమాన ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి

# వ్యక్తం చేసిన జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల జూన్ 13 ప్రజాజ్యోతి ప్రతినిధి**

నిన్న గుజరాత్ లోని అహ్మదాబాద్ నుండి లండన్ బయలుదేరిన విమానం కొద్ది క్షణాల్లోనే ప్రమాదానికి గురై విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులుఅదే ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు ఇది ఘోరమైన ప్రమాదం అని అన్నారు మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని వేడుకుంటున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ మాజీ వార్డ్ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం తదితరులు ఉన్నారు

# తాటిచెట్టు పైనుండి పడి గీతకార్మికుడికి గాయాలు

**కొడిమ్యాల,జూన్ 13,(ప్రజాజ్యోతి):**

తాటి చెట్టు పై నుండి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పూడూర్ గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పడి తిరుపతి గౌడ్ వృత్తిలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం తాటి చెట్టు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడని తెలిపారు.దీంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయని గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

